# కోయిల

**జయంతి వెంకటరమణ**
**(ఊర్వశి)**



నేను బస్సుకోసం ఎదురు చూస్తూనిలబడ్డాను.

అప్పటికే అరగంటపైగా అయింది.

ఒక ప్రక్కనుండి చీకట్లు ముసురుకొస్తుంటే కార్లలో తిరిగేనేను ఆ సాయంకాలంవేళలో ముక్కుమొగము తెలియని ఆచోట అనామికగా ఒక బస్సు దయా దాక్షిణ్యాలమీద ఆధారపడి క్షణాలు యుగాలుగా గడుపుతు వేచి ఉంటానని అనుకోలేదు. ఎక్కడఢిల్లీ ఎక్కడనేను ? అయితే ఇంతదూరం రావటానికి విశ్వం కారణంకాదూ! ఏడేళ్ళతరువాత పుట్టిపెరిగిన ఊరిని చూడటానికి, అక్కడికి ఇరవై మైళ్ళదూరంలో ఉన్న విశ్వాన్ని చూడటానికి నాకవకాశాన్నిచ్చింది. మద్రాసులో ఉన్న మా డైరక్టర్సు కాన్ఫరెన్సు - కాన్ఫరెన్సు తరువాతరెండు

రోజులకు జరుగనున్న శ్రీధర్ చెల్లాయిపెళ్ళి. అదీ మాఊరిలోనే. అన్నీ కుదిరాయనిపించింది. మద్రాసునుండి తిరుగుదలలో విశాఖలోదిగి అధికారికంగా మా బ్రాంచి ఆఫీసునొకసారి సందర్శించి, అక్కడనుండి మాఊరెళ్ళి పెళ్ళిచూసి, విశ్వాన్ని వాళ్ళ ఊరిలోకలసి తిరిగి విశాఖ వచ్చి ఫ్లైట్ కెళ్ళిపోదామని నా ఆలోచన. కొద్దిగా ముందుకువెళ్ళి వెనక్కు రాకతప్పదు. ఏంచేయనుమరి? 'నీవుపుట్టిన ఊరినే మరచిపోయా"వని శ్రీధర్ ఒకప్రక్క 'చిన్ననాటిస్నేహితుడు నీకు గుర్తులేదని' విశ్వం ఒకప్రక్క నన్ను ఉత్తరాల్లో వేధిస్తూంటే.

విశాఖ నుండి కారులో జంక్షన్ వరకు ప్రయాణం. అక్కడికి చేరిన మరుక్షణంలోనే గవర్నమెంటు బస్సులో రామాపురం (అంటే మాఊరు) కి ప్రయాణం చాలా హాయిగానే సాగింది. సుధాకర్ శ్రీకాకుళం వెళ్తూ కారులో లిఫ్టు ఇవ్వటంతో నాకు కాలం బాగ కలసి వచ్చింది.

ఊరంతా నన్ను చూచింది.

"నిన్ను చూసి గర్వపడుతున్నాం" అన్నారెందరో.

"కాలుకదిపితేకారట. ఊరు కదిపితే విమానమట. బాబు అదృష్టవంతుడు" అన్నారందరూ.

ప్రతిఒక్కరు నన్నుపలుకరించి, బంధుత్వాలను, స్నేహాలను' చుట్టరికాలను గుర్తుచేశారు.

పెళ్ళినుండి తిరిగివస్తూంటే ఊరంతా బస్సుస్టాండుకొచ్చి ఎక్కించి మరీ వెళ్ళారు. నాకు అప్పుడు గర్వంకలగలేదు. ఆనందమనిపించలేదు. నేను ఎదురుచూచిన ఆప్యాయతను, అభిమానాన్ని పొందలేకపోయానేమోనని అసంతృప్తిగానే బస్సెక్కాను. పోనీ విశ్వాన్ని చూస్తేనైనా ఈ అసంతృప్తి పోతుందేమోనని సిరిరామపురం జంక్షనులోదిగి ఒకఫర్లాంగునడిచి ఊరిలోకి విశ్వంయిల్లు వెతుక్కుంటూ పోతే నా కెదురైందేమిటి? వీధికున్నతాళంకప్ప. ద్విగుణీకృతమైన అసంతృప్తితో రోడ్డుపాయింట్ కి పావుతక్కువ ఆరుగంటలకొస్తే వేచియుండటమే అయింది.

వాచీ చూచుకున్నాను పావుతక్కువ ఏడు!

ఆ చోట వంటరిగా బిక్కు బిక్కు మంటున్న కిళ్ళీకొట్టుదగ్గర కెళ్ళి అడిగాను వైజాగ్ కి బస్సెన్ని గంటలకని.

అతను తమలపాకులు కత్తరించిపెట్టుకుంటూ, నామాటలు విననట్లు నటించాడు. అర్థమైందినాకు.

విల్సు సిగరెట్ పాకెట్ తీసికొంటూ మళ్ళీఅడిగాను అదేప్రశ్న "ఏడుగంటలకోటి ఉంటాదిబాబూ!" అన్నాడు కిళ్ళీకొట్టతను. పెట్రోమాక్సు లైటువెలుగులో ఒకసారి వాచీ చూచుకున్నాను. "పరవాలేదు ఇంకాటయిముంది". అని ధీమాపడుతూ సిగరట్ వెలిగించాను. పర్సు తెరచి అయిదురూపాయిలనోటు కిళ్ళీకొట్టు అతనికి అందిస్తూ అప్పుడు చూశాను నా పర్సులో బొత్తుగఉన్న చిన్న చిన్న చీటీలు. ముందుగా అవేమిటో గుర్తుకురాకపోయినా చీటీలు చూస్తుంటే అంతాగుర్తుకొచ్చింది. అందులోఉన్నవి అడ్రసులు - వివరాలు.

ఊరంతా నన్ను చూచి గర్వపడిందని, ఆనందించిందని నేను ఆనందించాను. కానీ నా ఆనందం ఎంతోసేపు నిలువలేదు. నన్నుపలుకరించేవారి మనసుల్లోను, నాకు మర్యాదలు చేసేవాళ్ళ చేతల్లోనూ, చూపుల్లోను, మాటల్లోను, స్వార్థమే తొంగి చూచింది. నానుండి ఏదో విధంగా ప్రయోజనాన్ని పొందాలనుకునేవాళ్ళు, వాళ్ళపిల్లలకి ఉద్యోగాలు వేయించమనేవాళ్ళు, నా పలుకుబడినుపయోగించి కాంట్రాక్టులు సంపాదించమనేవాళ్ళు. ఎన్నిరకాలో కనిపించారు. ప్రతిపని వెనుక స్వార్థం. ప్రతిపనివెనుక ఒక పథకం. మర్యాదనటన ఆప్యాయతనటన. మాట నటన పలుకునటన అంతానటనే.

ఏమిపొందాలని వచ్చానో అదే పొందలేకపోయాను.

వాచీచూసుకున్నాను. ఏడు పది.

"బస్సు ఇంకారాలేదేం?" కిళ్ళీకొట్టు అతన్ని అడిగాను. అతడు మాటాడలేదు.

"ఏబస్సుబాబూ!" బడ్డీకొట్టుముందు వేసివున్న బల్లమీద కూర్చున్న ముసలాయన అడిగాడు. అతనెప్పుడువచ్చాడో నేగమనించనేలేదు.

"వైజాగ్ వెళ్ళేబస్సు. ఏడుంపావు అవుతోంది" అన్నానేను

"ఈ పాసింజరుబళ్ళు నమ్మకంలేదుబాబు. డైరక్టుబస్సులు. నాన్ స్టాప్ బస్సులు ఇక్కడ ఆగవు. ఏడున్నరవరకు చూడండిబాబు రాకపోతే దారిలో బస్సు ఎక్కడో పడుకున్నట్టే!" అన్నాడాయన.

"ఏడున్నర దాటిన తరువాత బస్సులులేవా?" అతన్నే అడిగాను.

"ఎనిమిదిన్నరకొకటి ఉండాలిబాబు. అబస్సయినా ఇక్కడ ఆగుతుందన్న గ్యారంటీ లేదుబాబు. రాత్రవుతుంటే తొందరగా వెళ్ళిపోవాలని ధ్యాసేతప్ప ప్రయాణీకుల అసౌకర్యాలు వారికి తట్టవుబాబు!" అన్నాడాయన.

"లారీలుగానీ, వేన్ లు గాని ఏవీరావా ?"

"అన్నీ జి. టీరోడ్డుకే వెళ్తాయిబాబు" అన్నాడాయన.

అప్పుడాయన్ని దీపంవెలుగులో చూశాను. అరవైయ్యేళ్ళుంటాయాతనికి. ఎణ్ణునిశరీరచ్ఛాయ, ఖద్దరుచొక్కా, పంచె, చేతిలోఓ క్రర.

"కూర్చోండి బాబు. ఎంతసేపలా నిలబడతారు?" అన్నాడాయన. నేనుబల్లమీదకూర్చుంటూ, "మీరు బస్సుకోసమే ఎదురు చూస్తున్నారా ?" అని అడిగాను.

"కాదుబాబు. మాఅబ్బాయి టవునువెళ్ళాడు. వాడొస్తే ఇద్దరం కలిసి ఇంటికెళ్తాము" అన్నాడాయన.

మీరు ప్రయాణీకులేమోనని సంబరపడ్డాను. ఒంటరిగా వెళ్ళాలన్నమాట" అన్నాను. ఆయన సన్నగానవ్వుతూ "ఈ జీవితయానములో ఎవరికివారు ఒంటరిగా ప్రయాణించవలసిందేబాబు" అన్నాడు.

నేనాయన మాటల్లో అర్థంగ్రహించి "నిజమేలెండి" అన్నాను. వాచీచూసుకుంటూ "టయిము ఎంతయింది?" అడిగాడతను. "ఏడు ముప్ఫయి ఐదు అన్నాను.

కిళ్ళీకొట్టు అతను కలుగజేసుకుని "మీరోపని చెయ్యండిబాబూ. ఈరాత్రే వయిజాగ్ వెళ్ళాలంటే ఈ రోడ్డమ్మటే నాలుగైదు ఫర్లాంగు లెళ్ళినారంటే జీ. టి. రోడ్డు తగుల్తాది. ఎయ్యోలారీలు వస్తనేవుంటయి. ఆటిమీద ఎల్లిపోండి బాబూ!" అన్నాడు.

"వద్దుసూరప్పుడు. లారీలు రాత్రివేళల్లో ఒళ్ళుతెలియని వేగంతో వెళ్తాయి. ఎన్నిప్రమాదాలు మనం వినటంలేదు! చూడటంలేదు. వద్దుబాబూ. రాత్రివేళ లారీప్రయాణంవద్దు" అన్నాడాయన.

నాకేంచేయాలో తోచటంలేదు. వెంటనే అతనే అన్నాడు.

మీకభ్యంతరం లేకపోతే మాయింటికి ఈరాత్రికి వచ్చేయండి. ఉదయాన్నే అయిదున్నర గంటలబస్సుకి మారామం మిమల్నిదిగబెట్టేస్తాడు. ఏడు ఏడున్నరకల్లా వైజాగ్‌లో ఉంటారు". అన్నాడాయన నాముఖంచూస్తూ.

"ఎందుకండి మీకుశ్రమ" అని నేనేదో అనబోతుండగా అతనే అన్నాడు.

"శ్రమకేముంది బాబూ ఇందులో. ఇక్కడ హోటళ్ళు లాడ్జీలు ఉంటే నాదారిన నేను పోయేవాడినే. కాని ఇదో దిక్కుమాలినచోటు. ఈ దిక్కుమాలినచోట రాత్రివేళ వదలి ఎలా వెళ్లగలను? ఇంతకుముందు ఆరావిచెట్టుక్రింద ఒక హోటలుండేది. అప్పుడు ఎవరికైనా అక్కడ తలదాచుకోటానికి వీలయ్యేది. గాలివానకది పడిపోయింది. ఇప్పుడా అవకాశమూ లేదు..... అదిగో సైకిలు. మావాడుకూడ వస్తున్నాడు..." అన్నాడాయన సైకిలును దూరం నుండి కనిపెట్టి.

"రాత్రవుతూంటే మీరెందుకిక్కడ వుండిపోయారు?" అడిగాను.

"ఈరోడ్డుకిదిగువలో సిరిరామపురం అనే ఊరుంది. కొ దమ్మున్నఊరు. మంచిఊరుకూడా. అక్కడ రెండిళ్ళలో సం పాఠాలు చెప్పుకొని వస్తూంటాను. మావాడీవేళకి టవునునుండి వ నన్ను ఇంటికి తీసికెళ్తాడు. నన్నంతా యీ ప్రాంతంలో 'సంగీ మాష్టారు' అంటారు. నాపేరు జానకిరామయ్య. మా ఊరు ఇక్క మూడు ఫర్లాంగుల దూరంలో ఉంది. కన్నెవలస అంటారా ఊర్ని అని అతను చెప్తుండగా ఒక సైకిలువచ్చి మాముందాగింది.

"పదండిబాబూ! మావాడొచ్చాడు" అన్నాడాయన బల్లమీ నుండిలేస్తూ అప్పుడుచూశాను ఆయన ప్రక్కన వయోలిన్‌పెట్టిని.

"ఎవరు నాన్నగారూ వీరు" వయోలిన్ అందుకుంటు గాడాబ్బాయి. అతనికి పాతికేళ్ళుంటాయి.

"బస్సుకోసం వచ్చారా! వైజాగ్ వెళ్లాలి. ఈ రాత్రిబస్సు ఈవేళలో ఉండవుగా. మనింటికి రమ్మన్నాను" అన్నాడాయన.

"అలాగ మంచిపనిచేశారు. రండిమాష్టారూ!" అన్నాడత అని కొద్దిసేపు సైకిలువేపుచూస్తూ ఆలోచనలో పడ్డాడు. కొద్దిగవెన్నె వచ్చినేల తెల్లబడింది.

"నేనూనడుస్తాలేరా. ముగ్గురం కబుర్లు చెప్పుకుంటూ నడుద్ద అని "రండి" అంటూ నన్ను పిలిచాడాయన. నేను కదలక

"నేను ఎనిమిదిన్నర బస్సువరకుచూచి ఆ బస్సురాకపో ఇంతకుముందు చెప్పినట్లు, ఏలారీలోనో విశాఖవెళ్తాను". అన్నాను.

"వద్దుమాష్టారు! లారీల్లోప్రయాణం ఈ రాత్రివేళలో మం కాదు. నాన్నగారన్నట్టు మీరీరాత్రి మాయింటికొచ్చేయండి. రేపుఉద ఫస్టుబస్సుకి నేనేమిమ్మల్ని దిగబెడతాను" అన్నాడు. నేన్ప్రయత్న ఆయనవేపు చూశాను. తండ్రి ఏ మాటన్నాడో కొడుకూ అదే ప న్నాడు. నాకు చిత్రమనిపించింది. ఆయన సన్నగా నవ్వటం ఆవెన్నె చూశాను. నాకు కదలకతప్పలేదు. "పదరామం" అన్నాడాయన. అబ్బాయి నాబ్రీఫ్‌కేసు నందుకొని కేరియర్‌కికట్టి ముందునడిచా ముసలాయన నడుస్తూ వీడు మా పెద్దవాడు రామారావు. వీడితరు ఒక ఆడపిల్ల తరువాత కృష్ణుడు. వాడి తరువాత మరో ఆడ పెద్దమ్మాయి పెళ్ళయింది. కృష్ణుడు టవున్లో బి.ఎస్.సి. ఆ సంవత్సరం పరీక్షలు రాస్తున్నాడు. సీతపెళ్లి, తమ్ముడు చదువైతేనే పెళ్ళి చేసుకోనంటున్నాడు రాముడు" అన్నాడాయన.

"బాధ్యతలు తెలిసినవాడుకాబట్టే ఆమాటఅంటున్నాడు. ఇం మీరేం ఉద్యోగం చేస్తున్నారు?" అడిగాను రామారావుని.

"ఉద్యోగమంటే గవర్నమెంటు ఉద్యోగమేదీ చేయటంలేదండీ నేను బి.ఎ. పాసయి నాలుగేళ్లయింది. ఎమ్. ఏ. పాసయిన వాళ్ళే గోకొల్లలుగా ఉన్న ఈదేశంలో బి. ఎ. ముఖంచూసేదెవరు చెప్పండి. ఏదో చిన్న ఉద్యోగాలు చేస్తున్నాను" అన్నాడతను.

"అసలు ఉద్యోగ ప్రయత్నాలే చేయలేదా ?" అడిగాను,

"ఏ ఎడ్వర్టైజ్మెంటు చూసినా ఏముంది చెప్పడి! ఉన్నవి నాలుగు పోస్టులు. అందులో మూడు రిజర్వేషన్లలో పోతాయి. ఇక ఒక్కదానికోసం వందమంది కుమ్ముకోవటం. అందులో ఉత్తరం, దక్షిణం. ఇక బ్యాంకు పరీక్షలకెళదామంటే అంతేసి పరీక్షఫీజులు కట్టే స్థోమత నాకులేదు. అందుకే నాకనిపిస్తుంది. ఈ ఉద్యోగాలకోసం కాలాన్ని ,ధనాన్ని వ్యర్థపరచేకంటే ఏ కూలీ పనిచేసికున్నా హాయే ని" అన్నాడు.

అతని మాటలు నాకు నవ్వు తెప్పించాయి ప్రతీవాడు అంటాడు కూలీచేసికోనైనా బ్రతుకుతాం అని. కాని అదంత సులభమా! కూలి చేసికొని బ్రతకాలనుకునేవాడు చదువులకోసం పరుగెత్తడు. నేనడిగా నప్పుడు.

"అటువంటప్పుడు తమ్ముణ్ణి చదివించడమెందుకు !"

"వాడు తెలివైనవాడు. బి. ఇ కి వాడికి సీటువచ్చింది. వాడే ఇంటిపరిస్థితి చూచి వెనక్కి తగ్గి బి. ఎస్. సి.లో చేరాడు. వాడు ట్యూషన్లు చెప్పుకుని చదువుకున్నాడు. నేను పరీక్ష ఫీజుకి, పుస్తకాలకి డబ్బు సర్దాను. వాడ్ని ఎమ్.ఎస్.సి చదివించాలి. వాడి తెలివితేటలు మాస్టార్గిరికి పరిమితం కాకూడదు. దేశానికి ఉపయుక్తం కావాలి. తెలివైనవాడిని అణచిపెడితే అది దేశద్రోహం. సంఘద్రోహం." అవే శంగా అన్నాడు రామారావు. నేను రామారావుని మనసులో మెచ్చు కుంటూ ఉంటే జానకిరామయ్యగారందుకుని.

"అంతవరకు వాడు పెళ్ళిచేసికోట్ట!" ఫిర్యాదు చేస్తున్నట్టు అన్నాడు.

"ఇప్పుడవన్నీ ఎందుకండీ నాన్నగారూ !" అన్నాడతను.

"వచ్చేశాం" అన్నాడాయన ఊరిమొగల్లో ఉన్న ఇంటిని చూపిస్తూ. నేను పరీక్షగా చూశాను. ఎత్తరుగులపూరిల్లు - ఇంటిచుట్టూ తక్కలకంచె, ఇంటిముందు పరిమళాలు వెదజల్లే మల్లెలు వెన్నెల్లో ముద్దల్లా నాదృష్టిని పడ్డాయి, వీధి గుమ్మంలోంచి లోపలి ద్వారా ప్రవేలాడదీసిన హరికన్ లాంతరు కనిపించింది.

"అమ్మా! సీతా!!" ఇంటిముందు కొస్తూ పిలిచాడాయన. పిలు పుకొని కాబోలు పదిహేడు పద్ధెనిమిదేళ్ళ అమ్మాయి త్వరత్వరగా వీధిగుమ్మం దాటబోయి, వెనుతిరిగి వెళ్ళిపోయింది. వెళ్ళిన మరు క్షణంలోనే ఈశాన్య మూలనుండి పూవుల మొక్కల లోంచి చెంబు, నీళ్ళబాల్చీ తెచ్చి పువ్వుల మొక్కల్లో పెట్టి వెళ్ళిపోయింది. కాళ్ళూ చేతులు ముఖం కడుక్కొని వీధిగడప ఎక్కుతూంటే ముందుగదిలోకి నన్ను ఆహ్వానించి "సీతా! అమ్మను పిలువమ్మా!" అన్నాడాయన. నేను ఇంటిలోకి అడుగుపెడుతూ ఇంటిలోనున్న పరిశుభ్రతకు ముగ్ధుడ నయ్యాను, పైకి కనిపించేది పూరిల్లయినా లోపల నేలంతాగచ్చు. గోడలు సున్నంవేసిన ఇటుక గోడలే. చల్లనిగాలి ఆ ఎత్తు అరుగుల ఇంట్లోకి చనువుగా దూసుకొచ్చి లోపల ద్వారాలకు అలంకరింపబడ్డ రంగురంగు పూసల, రంగురంగు గొట్టాల తోరణాలని పలుకరించాయి. పూసల తెరలు గలగల నవ్వాయి. మల్లెల వాసన గదిలో మత్తెక్కి నట్టు తిరిగింది.

"వైజాగ్ బస్సు తప్పిపోతే తీసికొచ్చాను. ఈ రాత్రి మనిం టిలో ఉంటారు" అని ఆతడంటూంటే నేనుతలతిప్పి చూశాను. ఆయన శ్రీమతి కాబోలు. ఆమె వెనుక సీత. అచ్చు తల్లిపోలికే. ఆ కళ్ళు ముక్కు, ఆ పొడవు.

"మంచిపని చేశారు. ఒక పావుగంటలో వడ్డించేస్తాను" అంటూ ఆమె లోపలికెళ్ళిపోయింది.

"నేనువచ్చి మిమ్మల్ని కలిసి ఎంతోసేపయింది కదా. నేనెవరో అడగరేం?" అడిగాను మరి దాచుకోలేక.

"అతిథిని అడిగేదేముంది ! అయినా చెప్పండి" అన్నారాయన వాలుకుర్చీలో కూలబడుతూ. సీత మంచినీళ్ళు తెచ్చి చిన్నబల్లమీద పెట్టి వెళ్ళిపోయింది.

ఢిల్లీలోనే పని చేస్తున్న ఫర్మ్, నాహోదా, నా క్రింద పనిచేసే ఆఫీసు స్టాఫు, నేను చేసే విదేశయానాలు, చెప్పాను. ఢిల్లీలో తెలుగు వాళ్లు చాలమంది ఉన్నారని. మా ఫర్మ్‌లోనూ చాలా మంది ఉన్నా రని. ప్రతి సంవత్సరం నా చేతిమీదుగా ఎంతమందికో 'ఏ పాయింటు మెంట్సు' జరుగుతాయని చెప్పాను. ఇలా చెప్పడంలో వీరి ప్రవర్త నలో వచ్చే మార్పును గమనించాలని, వారిలో స్వార్థం ఏ ముసుగులో ఉందో చూడాలని నా కోరిక. అసరికి రామారావు స్నానంచేసి అలస టను మరచిపోయిన ముఖంతో వచ్చాడు.

"అవును ఢిల్లీలో చాలామంది తెలుగువాళ్ళున్నారు. తెలుగు వారైన మీరు ఉన్నత పదవిలో ఉన్నందుకు నేనేకాదు తెలుగు ప్రజ లంతా గర్వించాలి." అన్నాడాయన.

"నిరుద్యోగులయిన వాళ్ళెందరో వస్తూంటారు. ఉద్యోగికిదూర భూమి లేదుకదా !" అన్నాను. ఎరచూపిస్తూ.

"అవును కరణంగారి అబ్బాయి ఢిల్లీలోనే ఉన్నాడుగా. మొన్న సంక్రాంతికి వచ్చి వెళ్ళాడుగా" అన్నాడు రామారావు. సీతవచ్చి రామారావు కేదో కళ్ళతో చెప్పి వెళ్ళిపోయింది.

"రండి స్నానం చేదురుగాని" అన్నాడు రామారావు.

చంద్రుడు బావి గట్టున తారాడుతూంటే స్నానం చేసి రామారావు ననుసరించాను వంటింటిలోకి.

వంటింటి మధ్యగా ముక్కాలిపీటమీద ఒక పెద్ద హరికెన్ లాంతరు. మూడు పెద్ద పీటలు— వాటిముందు అరిటాకుల్లో వేడి వేడి పదార్థాలు డైనింగ్ టేబుల్ మీద హోదాని వెలాయిస్తూ, గాంభీర్యాన్ని నటిస్తూ, షోకుగా భోజనంచేసే నేను ఆ పూరింటిలో అలా యిమిడి పోతాననుకోలేదు. నేను కూర్చుంటూ" అరగంటే అయింది. అప్పుడే వంటయిపోయిందా ? అన్నాను కట్టెల పొయ్యివేపు ఆరిపోయిన కట్టెల వేపు చూస్తూ.

"ఇప్పుడు మీ కోసమని వండిందేదీ లేదు. మా యింటిలో ఒక మనిషికి సరిపడా భోజనం ఎప్పుడూ ఉంటుంది. పగలనక రాత్రనక మా యింటికి అతిధులు వస్తూంటారు. పుట్టి పెరిగిన ఊరుకదా. వచ్చినవారిని అభోజనంగా పంపటం గృహస్థు ధర్మం కాదు కదా" అన్నాడాయన. నేను 'ఎంతమంది అతిధులను ఆదరించి ఉంటానా' అని ఆలోచిస్తుండగా ఆయన అన్నారు.

"మీది ఢిల్లీ అన్నారు. ఇంతదూరం రావటం ఎలా జరిగింది?" అని నేను రామాపురం వెళ్ళటం అక్కడనుంచి సిరిరామపురం విశ్వం కోసం వెళ్ళటం అంతా చెప్పాను.

"ఇంతకు ముందు మీరేం చేసేవారు ?' అని అడిగాను.

"అప్పటికీ ఇప్పటికీ ఒకటే వృత్తి నాది. సంగీత పాఠాలు చెప్పడం, సంగీత పాఠాన్ని చెప్పుకుంటునే ఇంత సంసారాన్ని ఈదుకుని వచ్చాను. నాలుగైదు సంవత్సరాల క్రితం వరకు సంగీత పాఠాలు చెప్పుకుంటూ, కచేరీలు చేసేవాడిని. ఓపిక తగ్గి ఇప్పుడు మానేశాను. శ్రీరామనవమికి మాత్రం సిరిరామపురంలోనూ, మా ఊళ్ళోనూ కచేరీలు చేస్తాను. ఈ ప్రక్క గ్రామంలో ఉదయం నాలుగు సిరిరామపురంలో సాయంత్రం రెండు ట్యూషన్‌లు ఉన్నాయి. సంగీతం మీద అభిమాన మున్నవారుండ బట్టే ఈ రథం నడుస్తోంది. రామం ఉదయం ఫస్టు బస్సుకెళ్ళి న్యూస్ పేపర్లు తెచ్చుకుని సైకిలు మీద ఈ చుట్టు ప్రక్కల నాలుగు గ్రామాల్లోనూ పంచి ఎనిమిది గంటల కల్లా ఇంటికి వస్తాడు. తొమ్మిది గంటలకు భోజనం చేసి కృష్ణుడికి కేరియర్ పట్టుకుని జంక్షన్ వరకు సైకిలుమీద వెళ్ళి బస్సు మీద టవున్ వెళ్తాడు. కృష్ణుడికి కేరియర్ ఇచ్చేసి సాయంత్రం వరకు బైండింగ్ షాపులో పనిచేసి సాయంత్రం మిగిలిపోయిన పని ఇంటికి తెచ్చుకుంటాడు. ఈ మధ్య గంట వీలుచూచుకుని 'టైపు రైటింగ్ నేర్చుకున్నాడు. హయ్యర్ పరీక్ష మొన్ననే రాశా రిజల్ట్సు కూడా రావాలి. రిజల్ట్సు రాగానే జాబు వర్క్ కూ మొదలు పెడతాడు. సెకండు హేండ్ రెమింగ్‌టన్ మిషన్‌కో చూస్తున్నాము అన్నాడాయన.

"బైండింగ్ షాపులో ఎంతిస్తారు?" అడిగాను రామారావుని

"షాపునాదేనండి. షాపు అద్దెపోనూ ఖర్చులుపోగా రెం వందలు మూడు వందలు మిగులుతాయి. ఆఫీసర్సు ఫైల్సు, ఆ పేడ్సు తయారు చేస్తాను. పని ఎక్కువగా ఉంటే పని కుర్రవా పెట్టుకుంటాను ఒక్కొక్కప్పుడు పనిఇంటికే తెచ్చుకుంటాను. సే నేనే చూచుకుంటాను అన్నాడు రామారావు.

మా భోజనాలు ముగిశాయి.

"శ్రమ ఎక్కువ ఫలితం తక్కువ. ఏదైనా నిలకడై ఉద్యోగం దొరికితే ఈ ప్రయాస ఉండదు" అన్నాను.

"కష్టపడకుండ తిండెలా దొరుకుతుంది చెప్పండి. ప్రతివా గవర్నమెంటు ఉద్యోగాలు రావాలంటే, బట్టలు నలగకూడదు అం ఎలా అవుతుంది చెప్పండి. మనకన్నా అధ్వాన్నమైన పరిస్థితుల్ల ఉన్నవాళ్ళెందరో కదా!"అన్నారు జానకిరామయ్యగారు పెరటిలో జా చెట్టువేపు తీసికెడుతూ, అక్కడ మూడు మంచాలు వాల్చిఉన్నాయి సీత పక్కలు వేస్తోంది. ఆమె పనిముగించి ఇంటిలోకి వెళ్ళిపోగా "ఆ మంచమీది, ఇదినాది, అది రామంది. ఉదయం నాలుగున్నరకల్ల రామం మిమ్మల్ని లేపేస్తాడు. బస్సుకి రామం దిగబెడతాడు" అన్నా రాయన.

"అలాగే" అన్నాను. కొద్దిసేపు మవునంగా ఉన్నతరువాత.

"ఈ అమ్మాయి పెళ్ళయిపోతే మీకు కొంత రిలీఫ్ కదా!" అన్నాను.

"అవును. అందుబాటులో ఉన్న సంబంధం దొరకాలిగా" అన్నారాయన.

"ఏమైనా చదువుకుందా?" అడిగాను.

"టెన్తు పాసయింది" అన్నారాయన. తరువాత నేనేం అడగ లేను.ఆయన భగవన్నామ స్మరణచేసుకుంటూ నిద్రకొరిగారు. రామారావు గదిలోపల ఎక్కడో పనిచేసికుంటున్నాడు.

నాకు చాలాసేపటి వరకు నిద్ర రాలేదు. ఏవో ఆలోచనలు నాలో కదలసాగాయి. నా పదవిని చూచి నన్ను ఆశ్రయించాలని చూచే వారు ఒకప్రక్క, నాహోదా, నాపదవి తెలిసి నన్ను వెయ్యికాపాని రామయ్యగారి కుటుంబం ఒకప్రక్క—నాకు సమస్యగా మిగిలారు.

చంద్రుడు నెత్తిమీది కొచ్చినప్పుడెపుడో నే నిద్రకొరిగాను. అప్పటికి రామారావింకా పనిచేస్తునే ఉన్నాడు. ఎంతసేపు నేన్నిద్ర పోయానో నాకు తెలియదు. రామారావు నిద్రలేపుతున్నాడు. "పావు తక్కువ అయిదయింది. అయిదున్నరకే బస్సు" అంటూ నేను లేచి చూచేసరికి ప్రక్కనున్న మందాలు ఖాళీ కొద్దికొద్దిగా వెలుగువస్తోంది. ఎక్కడనుండో సన్నగా వయోలిన్ మీదనుండి హాయిగొలిపే సంగీతం వినవస్తోంది. నాకు సంగీతం తెలియదు. ఆరాగమేదో చల్లగాఉంది. చల్లనిగాలి మెల్లగా హాయిగా వీస్తున్నట్టుంది.

నేను బ్రష్‌కోసం ఇంటిలోకి అడుగుపెట్టేసరికి సీత చాపమీద కూర్చుని వయోలిన్ వాయిస్తోంది. జానకిరామయ్యగారు ఆమెకు ఎదురుగా కుర్చీలో కూర్చుని సంగీతం వింటున్నారు. అది చాల మనోహర దృశ్యం అనిపించింది నాకు. ఏ పుణ్యం చేసుకుంటే తప్ప లభ్యంకాని దది అనిపించింది.

నే బావి దగ్గరకెళ్ళేసరికి రామారావు అరటి మొక్కల్లో నీళ్ళు తోడి ఉంచాడు.

నేను స్నానం చేసి వచ్చేసరికి సీత మూడు గ్లాసుల్లో కాఫీ పట్టుకొచ్చింది.

"మీరదృష్టవంతులు. సంగీత సరస్వతి మీయింట్లో తిష్టవేసింది. మీ ఆదర్శప్రాయమైన జీవితవిధానం నాకుముచ్చట కలిగిస్తోంది. మీయింట ఆతిధ్యం దొరకటం నా అదృష్టం. మీకే సహాయం కావాలో చెప్పండి చేస్తాను" అన్నాను కాఫీగ్లాసందుకుంటూ.

ఆయన సన్నగానవ్వి "మీరెప్పుడు ఇటుప్రక్కకు వచ్చినా మాయింటికిరండి. మీవంటి మంచివారి సన్నిహిత్యం మాకెంతో ఆనంద దాయకం" అన్నారాయన.

నేను గతుక్కుమన్నాను. నా మంచితనం వీరికేంతెలుసని.

"అవునుబాబు! రామాపురం ఎప్పుడువచ్చినా ఇక్కడికిరావటం మానకండి" అన్నారామె.

రామారావు సైకిలు సిద్ధంచేస్తున్నాడు. టయిమయిందని హెచ్చరిస్తూ. నేను అందరిదగ్గర సెలవు తీసుకుని బయలుదేరాను. సైకిలు ముందుకు కదులుతుంటే ఆత్మీయులనందర్ని దూరంచేసికొని వెళ్తున్నట్టు అనిపించిందినాకు. వెలుగుబాగానేవచ్చింది. దారిపొడుగునా ఉన్నమామిడిచెట్లు ఫలభారంచేత వంగిఉన్నాయి. చల్లనిగాలి హాయిగా వీస్తుంటే నా ఆలోచనలు పరివరివిధాలుగా సాగాయి.

స్వార్థపరులుండే యీలోకంలో ఏ ప్రయోజనాన్ని ఇతరుల నుండి ఆసించక సహాయపడే నిస్వార్థపరులుంటారా ? ఉండరనే నా నమ్మకం. నానుండి ఏ ప్రయోజనాన్ని ఆశించి ఊరకంగా నాకు నీడ నిచ్చారు. నా ఆలోచన సాగుతుండగనే సైకిలు జంక్షను చేరింది.

అప్పటికే పేపరు కట్టలువచ్చి కిళ్ళీకొట్టుదగ్గర పడివున్నాయి. రామారావు గబగబా సైకిలుకి స్టాండువేసి పేపరుకట్టలు లెక్కపెట్టుకున్నాడు" ఏదోవిన్నట్టు తలెత్తి "అదిగో మీబస్సుకూడ వచ్చేస్తోంది. పదండి అటువేపు" అంటూ నా బ్రీఫ్‌కేసు పట్టుకొని రోడ్డుదాటాడు. నేను బస్సెక్కుతూంటే కండక్టరుకి తానే టిక్కెట్టు డబ్బులిచ్చాడు అది చూచి "రామారావు! ఏమిటది. నీవీకూడదు" అన్నాను.

"మీరు మా అతిధికదా. అందుకని నేనివ్వవచ్చు" అని "మీకు ఏమాత్రం మర్యాదలు చేయలేకపోయాం. ఏమనుకోకండి" అంటూ చెయ్యూపాడు. బస్సుకదులుతూంటే నాకు నోటమాటరాలేదు. ఎందరికో ఉద్యోగాలిప్పించిననేను. ఎందరిఅవసరాలనో ఎన్నోరకాలుగా తీర్చిన నేను అతనిముందు చిన్నపిల్లవాడినైపోయినట్టనిపించింది నాకు. బస్సు ముందుకు కదులుతూంటే దారిప్రక్కనున్న మామిడితోటలోంచికోయిల కూస్తూంటే ఒక్కసారి నిద్రనుండి మెలకువ వచ్చినట్టయింది నాకు.

మామిడి తోటలోంచి చల్లనిగాలి నా చుట్టూ హాయిగొలుపుతూ తిరిగింది. వెంటనే నాకు సీత జ్ఞాపకం వచ్చింది. వెనువెంటనే మా తమ్ముడు మోహనూ గుర్తుకు వచ్చాడు. కృష్ణమూర్తిని నేను చూడలేదుగాని విశాఖలోనున్న మా బ్రాంచిలో ఖాళీగావున్న టెక్నికల్‌పోస్టు నా దృష్టి కందింది.


ఉచితం ఉచితం ఉచితం

**తెల్ల మచ్చలు**

ఏ రకం తెల్ల మచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషధం

**"డాగ్ వినాశక్"**

వాడినయెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.

**Address :**
**Samaj Kalyan (R. L.- 18) P. O. Katri Sarai (Gaya).**